క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మండల పూజలు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు పంచాయతీ పరిధిలోని బసవరాజుపాళెంలో నూతనంగా ప్రతిష్ఠించిన నాగార్పమ్మ శిలల వద్ద మండల పూజలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన సిద్ధవటం రమణారెడ్డి, రాధా దంపతులు, వారి కుటుంబ సభ్యులు కలిసి ప్రతిష్ఠించిన నాగశిలల వద్ద విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

పెంపుడు కుక్కలకు టీకాలు



అల్లూరు: ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరులోని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలను ఆదివారం వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మహేశ్వరయ్య మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. కుక్కల వల్ల రేబిస్ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. దీని నివారణకు ప్రతిఒక్కరూ తమ పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని తెలిపారు.

నేడు లోక్ కల్యాణ్ మేళా

ఆత్మకూరురూరల్: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం ఒక కుటుంబం, ఒక వ్యాపారవేత్త కార్యక్రమంలో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఈ మేళాను నిర్వహిస్తున్నామని చెప్పారు. పీఎంఎస్‌వీఏ నిధి 2.0 పథకం కింద చిరువ్యాపారుల నుంచి రుణాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి రుణాల పంపిణీని సులభతరం చేస్తామన్నారు. బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను ప్రాసెస్ చేయిస్తామన్నారు. లబ్ధిదారులకు డిజిటల్ ఆన్‌బోర్డింగ్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎఫ్‌ఎస్ఎస్ఏఐ సమన్వయంతో వీధి ఆహార విక్రేతలకు శిక్షణ ఇస్తామన్నారు. వీధి విక్రయదారులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని బ్యాంకుల మేనేజర్లు, కార్మిక శాఖ, సివిల్, హెల్త్, ఫుడ్‌సేఫ్టీ, ఐసీడీఎస్ శాఖల ప్రతినిధులు, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, వీధి విక్రయదారులు తప్పక హాజరుకావాలని కమిషనర్ కోరారు.

బీఎస్పీ కమిటీల నియామకం



ఆత్మకూరురూరల్: పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంగం మండలానికి సంబంధించిన పలు విభాగాలకు ప్రతినిధులను నియమించారు. సిద్దీపురం సెక్టార్ అధ్యక్షుడిగా సయ్యద్ ఫైజల్, సంగం మండల ప్రధాన కార్యదర్శిగా చెన్నకృష్ణయ్య, కోశాధికారిగా నారాయణమూర్తిని నియమించారు. బీఎస్పీ సీనియర్ నాయకులు చెన్నుపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా పార్టీ సలహాదారుడు కృష్ణ, ఆత్మకూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపం.. తాగునీరు కలుషితం

నెలల తరబడి శుభ్రతకు నోచుకోని వాటర్ ట్యాంకులు

- క్లోరినేషన్ చేపట్టడంలోనూ అలసత్వం
- అటకెక్కిన నీటి పరీక్షలు
- రోగాల బారిన గ్రామీణ ప్రాంత ప్రజలు

దుత్తలూరు : జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలు కలుషిత నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. పల్లెల్లోని మంచినీటి పథకాల పైపులైన్లు, గేట్‌వాల్వులు వద్ద లీకేజీల కారణంగా మురుగు నిల్వ చేరి తాగునీరు కలుషితమవుతోంది. దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ లోపంతో వాటర్ ట్యాంకులను కనీసం రెండు నెలలకు ఒకసారి కూడా శుభ్రం చేయని పరిస్థితి. ఈ కారణంగా ప్రజలకు రక్షిత మంచినీరు ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో ఎంపీడబ్ల్యూఎస్ పథకాలు 623, పీడబ్ల్యూఎస్ పథకాలు 1147, డైరెక్ట్ పంపింగ్ స్కీంలు 1018, సీపీడబ్ల్యూఎస్ స్కీంలు 12, చేతి పంపులు 14,425 ఉన్నాయి. వాటర్ ట్యాంకులను ప్రతి పదిహేను రోజులకు ఒకసారి శుభ్రం చేయాలి. పరిశుభ్రం చేసిన తేదీలను, పరిశుభ్రం చేయాల్సిన తదుపరి తేదీలను బోర్డుపై ఖచ్చితంగా నమోదు చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో వాటర్ ట్యాంకులను నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. ప్రజలకు క్లోరినేషన్ చేసిన రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి. జిల్లాలో అధిక శాతం ప్రాంతాల్లో క్లోరినేషన్ చేపట్టడం లేదు. ప్రతి రక్షిత మంచినీటి పథకం వద్ద రిజిస్టర్లు ఏర్పాటు చేసి ఎంత పరిమాణం తాగునీటి సరఫరా చేసింది, బ్లీచింగ్ పౌడర్ ఎంత కలిపింది నమోదు చేయాలి. కానీ అసలు రిజిస్టర్లే కనిపించడం లేదు. ఓవర్ హెడ్ ట్యాంకులపైన మూత వేసి ఉంచాలి. ట్యాంకుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. తాగునీటి పైప్‌లైన్లు లీకేజీలు లేకుండా చూడాలి. వీధి కుళాయిల చుట్టూ సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేయాలి. అయితే పైపులైన్ల లీకేజీలను అరికట్టడంలో అధికార యంత్రాంగం విఫలమవుతుంది. డైరెక్ట్ పంపింగ్ చేసే విధానంలో కూడా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పథకం నిర్వహణ లోపంతో లీకేజీలతో పరిసరాలు అపరిశుభ్రమవుతున్నాయి. పలుచోట్ల కాలువలు, చెరువుల్లో పైపులైన్లు వెళుతుండడంతో లీకేజీలు ఉన్నచోట్ల తాగునీరు కలుషితమవుతోంది. ట్యాంకులను నిర్దేశిత సమయంలో శుభ్రం చేయకపోవడంతో అడుగున పాచి పేరుకుపోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో ట్యాంకుల శుభ్రతలో పంచాయతీ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టి, ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఈ చిత్రంలోని చేతిపంపు నర్రవాడ ఎస్సీ కాలనీలోది. చేతి పంపు చుట్టూ దట్టంగా పాచిపట్టింది. దాన్ని తొలగించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో తాగునీరు పట్టుకునేందుకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఈ చిత్రం దుత్తలూరు పంచాయతీ పరిధిలోని చింతలగుంటలోది. ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద లీకేజీ నీటి కారణంగా మురుగు నిల్వ చేరి పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. లీకేజీని అరికట్టి పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.



దుత్తలూరులో పైపులైన్ లీకేజీతో కలుషితమవుతున్న తాగునీరు



నందిపాడు ఎస్సీ కాలనీలో డైరెక్ట్ పంపింగ్ స్కీం వద్ద లీకేజీ నీటితో పాచిపట్టిన దృశ్యం



ఈ చిత్రం నర్రవాడ ఎస్సీ కాలనీలోది. ఇక్కడ గత కొన్ని నెలలుగా పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు కలుషితం అవ్వడమే కాకుండా దట్టంగా గడ్డి పెరిగి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పైపులైన్ లీకేజీని అరికట్టేందుకు చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



శుభ్రతకు నోచుకోని నందిపాడు ఓవర్ హెడ్‌ట్యాంక్

అటకెక్కిన నీటి పరీక్షలు

అధికారుల పర్యవేక్షణ లోపంతో నీటి పరీక్షలు అటకెక్కాయి. ప్రస్తుతం జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. రక్షిత మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేసే కలుషిత నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మంచినీటి పథకాల నిర్వహణకు ప్రత్యేక యంత్రాంగం ఉన్నప్పటికీ వాటర్ ట్యాంకుల శుభ్రత, నీటి పరీక్షలు, క్లోరినేషన్ వంటి చర్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని కొన్ని మండలాలలో కనీసం రెండు నెలలకు ఒకసారి కూడా ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. పైప్‌లైన్ లీకేజీలు, వాల్వు గుంతల ద్వారా తాగునీరు కలుషితమవుతున్నా పట్టించుకోవడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది నడుమ సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తోంది. నీటి పరీక్షల కిట్ల ద్వారా మంచి నీటిని పరీక్షించి సమస్య ఉందని తెలిస్తే ల్యాబ్‌కు పంపించి రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలి. కానీ పంచాయతీల్లో నీటి పరీక్షల కిట్లే కనపడడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి రక్షిత జలాలను అందించేందుకు చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయి ఆదేశిస్తున్నా అవి అమలుకు నోచుకోవడం లేదు.

మానవ జీవితమంతా సరిగమలే



మాట్లాడుతున్న సోమవరపు యానాదిరెడ్డి

ఆత్మకూరురూరల్: తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహించే మంచిమాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని చావిడి వద్ద ఉన్న శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా సోమవరపు యానాదిరెడ్డి హాజరై మానవ జీవితం సరిగమలు అనే అంశంపై ప్రసంగించారు. ప్రతి పాటలో ప్రతి స్వరం తనకున్న ప్రత్యేకతను చాటుకున్నట్లే మానవ జీవితంలో కూడా అనేక సరిగమలు ఉంటాయన్నారు.జీవిత సరిగమలుగా భావించి ప్రతి మనిషి సహనం, పట్టుదల, కృషి, ఆత్మనిర్భరం అలవర్చుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించి విజయతీరాలకు చేరుకోవచ్చన్నారు. ప్రతి మనిషి జీవితంలో సుఖదుఃఖాలు, జయాపజయాలు, ఎత్తుపల్లాలు ఉంటాయని, వాటిని అనుభవించినప్పుడే మానవజీవితం సంపూర్ణం అవుతుందన్నారు. తెలుగుభారతి సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడు అంకినపల్లి గోవిందరెడ్డి, వివిధ విభాగాల ప్రతినిధులు కొల్లా వెంకటేశ్వర్లు, ఎస్‌వీ రమణయ్య, కేవీ శేషారెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, ఒమ్మి, సుబ్రహ్మణ్యం, రామయ్య, స్వామి, సుబ్బయ్య, శ్రీనివాసరావు, కలిశెట్టి రవీంద్రకుమార్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, జాషువాకు ఘన నివాళి



సోమశిల: జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో సమరయోధుడు భగత్‌సింగ్, కవి సామ్రాట్ గుర్రం జాషువా జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. భగత్‌సింగ్, జాషువా చిత్రపటాలకు తెలుగు భారతి సేవా సమితి ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం ఎస్‌వీ రమణయ్య, పీసీవీ సుబ్బయ్య, తదితరులు భగత్‌సింగ్, జాషువా జీవిత విశేషాలను వివరించారు.

సోమశిల: అనంతసాగరంలోని గ్రంథాలయంలో సమరయోధుడు భగత్‌సింగ్, కవి సామ్రాట్ జాషువా చిత్రపటాలకు గ్రంథాలయాధికారి నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు విప్లవ వీరుడు భగత్‌సింగ్, జాషువా జీవిత విశేషాలను వివరించారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరిరూరల్: మండలంలోని వెంకటరావుపల్లిలో గ్రామదేవత పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగళ్ల సామగ్రిని కొత్త బుట్టల్లో పెట్టుకుని రామాలయం వద్ద నుంచి ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం సాముహికంగా పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారికి మొక్కుకున్నారు.

రామాలయంలో చోరీ

దుత్తలూరు: దుత్తలూరు పంచాయతీ పరిధిలో కట్టకిందపల్లిలోని రామాలయంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడారు. ఆలయ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు అమ్మవారికి దాతలు సమర్పించిన ఐదు బంగారు తాళిబొట్లతో పాటు హుండీని పగలగొట్టి అందులోని నగదును చోరీ చేశారు. ఉదయం చోరీని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. చోరీసొత్తు విలువ సుమారు రూ.2 లక్షల మేర ఉండవచ్చునని గ్రామస్తులు తెలిపారు.

అసంపూర్తిగా మరుగుదొడ్లు



వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వెలుగు, ఉపాధి, హౌసింగ్ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ మరుగుదొడ్లు లేకపోవడంతో అధికారులు, సిబ్బందితో పాటు వివిధ పనులపై వచ్చే వారు అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాదువు మహిళ లు అవస్థ పడుతునారు. ఈ సమస్యను గుర్తించి రెండేళ్ల క్రితం మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రారంభించారు. శ్లాబ్ వరకు నిర్మించి అసంపూర్తిగా నిలిపివేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చినా కూడా నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలలు అభివృద్ధి

ఉదయగిరిరూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఎంఈఓ–1 తిప్పిరెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాల, గ్రామాన్ని గుర్తుపెట్టుకుని అభివృద్ధిలో భాగస్వాములుకావడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఏ స్థాయిలో ఉన్నా కన్న తల్లిదండ్రులు, చదువు చెప్పిన గురువులు, చదువుకున్న పాఠశాల, పుట్టిన ఊరును మరువరాదన్నారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయ వసతి కల్పించిన పూర్వవిద్యార్థులతో పాటు సైన్స్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన పూర్వ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఈవీ నారాయణను అభినందించారు. కాగా బండి ప్రసాద్ మైక్‌సెట్, కాకు రమాదేవి రెండు ఐరన్ బాక్సులు, కల్లూరి రవీంద్రారెడ్డి విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందించారు. హెచ్‌ఎం నాయబ్‌రసూల్, పూర్వవిద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

మాగాణిలో అనధికారికంగా లేఅవుట్ల నిర్మాణం



లేఅవుట్‌కు ఎగువ భాగంలో ఉన్న రైతుల పొలాలు



అనధికారిక లేఅవుట్‌లో చేపడుతున్న నిర్మాణాలు

- పొలాల్లోకి దారి లేక రైతుల ఇబ్బందులు

కలిగిరి: కలిగిరిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిని అనుకుని అనధికారికంగా లేఅవుట్ల నిర్మాణం చేపట్టడంతో మాగాణి పొలాల్లోకి వెళ్లడానికి దారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సర్వే నంబర్లు 1017/1, 1017/2, 1017/3, 1017/4, 1017/3ఎ, 1017బీలోని మాగాణి భూముల్లో అనధికారికంగా లేఅవుట్లను వేశారు. వీటి మీదుగా ఎగువన ఉన్న పొలాల్లోకి వెళ్లేందుకు రైతులను అనుమతించడం లేదు. మరోవైపు కలిగిరి పెద్దచెరువుకు సంబంధించి పంట కాలువలను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో లేఅవుట్లకు ఎగువన ఉన్న భూములు బీడుగా మారుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనధికారిక లేఅవుట్లపై రైతులు ఫిర్యాదు చేసినా పంచాయతీ, రెవెన్యూ, నుడా అధికారుల నడుమ సమన్వయ లోపంతో సమస్య పరిష్కారం కావడంలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

పొలాల్లోకి దారి లేదు



మాగాణి పొలాల్లో అనధికారికంగా లేఅవుట్లు వేశారు. ఎగువన ఉన్న పొలాల్లోకి వెళ్లేందుకు దారి వదలలేదు. మాకు 1.50 ఎకరాల పొలం ఉంది. అందులోకి ట్రాక్టర్ వెళ్లే అవకాశం లేదు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లే లేఅవుట్లు అనధికారమైనవని నివేదిక ఇచ్చారు. కానీ చర్యలు తీసుకోవడం లేదు.
–మల్లికార్జున్‌రెడ్డి, రైతు, జిర్రావారిపాళెం

లోకపావని పాహిమాం



ఆత్మకూరురూరల్: కాశీనాయన ఆశ్రమంలో వనదేవత అలంకారం



ఆత్మకూరురూరల్: బట్టేపాడులో మహాలక్ష్మిగా దివ్యమాంబ



ఆత్మకూరురూరల్: విశ్వేశ్వరుని ఆలయంలో బండాసురవధ అలంకారం



సోమశిలలో చండికాదేవిగా కామాక్షిదేవి



కలిగిరి: రాజరాజేశ్వరిగా భద్రకాళి



సంగం: చండీదేవిగా కామాక్షిదేవి



దుత్తలూరు: మహాలక్ష్మిగా రేణుకఎల్లమ్మ



వరికుంటపాడు: కళరాత్రి అలంకరణలో మానసాదేవి



కావలి: పాతూరుశివాలయంలో చండీశ్వరీదేవి అలంకారం

కావలి(అల్లూరు): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడోరోజు ఆదివారం అమ్మవారు విశేషాలంకారాల్లో భక్తులను అనుగ్రహించారు. కావలిలోని పాతూరు శివాలయంలో చండీశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయం, సంతానలక్ష్మి ఆలయం, గండిపాళెంలోని నాగారప్పమ్మ ఆలయాల్లో చండీదేవిగా అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో కళరాత్రి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలిగిరి: తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు.

దుత్తలూరు: నర్రవాడ పంచాయతీ గుడేవారిపాళెంలోని రేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులను కటాక్షించారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఆత్మకూరురూరల్: పట్టణంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బండాసురవధ అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు బ్రహ్మశ్రీ మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి నక్షత్ర కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నక్షత్ర పంచహారతి మహానివేదనం జరిపారు. ఆత్మకూరులోని కాశీనాయన ఆశ్రమంలో సరస్వతీదేవి అమ్మవారు వనదేవత అలంకారంలో భక్తులను కటాక్షించారు. బట్టేపాడులో గ్రామ దేవత దివ్యమాంబ అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు చండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.



ఉదయగిరి: చండీదేవిగా పార్వతీదేవి



ఉదయగిరి: చండీదేవిగా సంతానలక్ష్మి